క్లుప్తంగా

సీపీఐ మండల కార్యదర్శిగా స్వామి



నెల్లికుదురు: సీపీఐ మండల కార్యదర్శిగా మండలంలోని మునిగలవీడు గ్రామానికి చెందిన బైస స్వామిని ఎంపిక చేసినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, నియోజకవర్గ కార్యదర్శి అజయ్ సారథి శనివారం తెలిపారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శులుగా తూటి వెంకట్‌రెడ్డి, చిర్ర సత్యనారయణలను ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

నిందితుడిని శిక్షించాలి

కురవి: గిరిజన కుటుంబాన్ని హత్య చేసిన నిందితుడిని శిక్షించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకుడు మాలోత్ కిషన్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నర్సంపేట డివిజన్ చెన్నారావుపేట మండలం పదహారుచింతల తండాలో గిరిజన దంపతులను కిరాతకంగా హత్య చేసిన వ్యక్తికి శిక్ష పడేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనులకు రక్షణ కల్పించాలన్నారు. తొర్రూరులో గిరిజనుడు సురేష్‌నాయక్‌ను తీవ్రంగా కొట్టిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

‘ఇబ్బందులకు గురిచేయడం సరికాదు’

బయ్యారం: రెండోవిడత గొర్రెల కోసం గొల్లకురమలు కట్టిన డబ్బులను తిరిగి వారికి చెల్లించటంలో రాజకీయ జోక్యం తగదని బీఆర్‌ఎస్ మండల నాయకులు ఏనుగుల ఐలయ్య అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో డబ్బులు కావాలని పశు వైద్యాధికారులకు దరఖాస్తులు చేసుకున్న వారిందరికి డబ్బులు ఇవ్వకుండా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సూచించిన ప్రాంతాల వారికే డబ్బులు ఇవ్వటం సరికాదన్నారు. లబ్ధిదారులు చెల్లించిన వాటాధనంను తిరిగి చెల్లించడంలో ప్రభుత్వం జాప్యం వహిస్తూ గొల్లకురమలను ఇబ్బందులకు గురి చేయటం సరికాదన్నారు.

నిత్యవసరాల పంపిణీ



నెల్లికుదురు: మండలంలోని రాజులకొత్తపల్లి గ్రామంలో హనుమాన్ స్వచ్ఛంద సేవాసమితి ఆధ్వర్యంలో యువకులు నిరుపేద కుటుంబం అయిన మాతంగి యాకమ్మకు శనివారం నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. కార్యక్రమంలో హరీశ్, అశోక్, వేణు, విష్ణు, అంజి, ప్రశాంత్, సన్ని, శ్రీలత, చిరంజీవి, సాయి, వెంకటేశ్ పాల్గొన్నారు.

బెల్లయ్యనాయక్‌ను కలిసిన విద్యార్థి సంఘం నాయకుడు



మరిపెడ రూరల్: ఇటీవల తెలంగాణ గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ తేజావత్ బెల్లయ్యనాయక్‌ను యూఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ద బోయిన వీరబాబు మహబూబాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా బెల్లయ్యనాయక్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపాడు.

ఆర్థికసాయం



దంతాలపల్లి: మండలం బీరిశెట్టిగూడెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన పగిండ్ల కుమార్ కుటుంబ సభ్యులకు రూ.33వేల ఆర్థిక సాయం, 50కేజీల బియ్యం అందించారు. శనివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని యువకులు విరాళాలు సేకరించి మృతుడి కూతురు హారతికి అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కుటుంబ పెద్దదిక్కును కోల్పోయి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లి, చెల్లి ఏమి చేయాలో తెలియక అయోమయ స్థితిలో ఉన్న బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు.

హెచ్‌ఆర్‌ఎస్, కేవీకే సందర్శన

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని హోలీ వర్స్ హైస్కూల్ విద్యార్థులు మల్యాల జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్, కృషి విజ్ఞాన కేంద్రాన్ని శనివారం సందర్శించారు. పాఠశాల విద్యార్థులకు సీనియర్ సైంటిస్ట్ భాస్కర్, ఫార్మ్ మేనేజర్ దినేష్ భూమి సారాన్ని పరీక్షించే విధానాన్ని కేవీకే ల్యాబ్‌ల్లో వివరించారు. విజ్ఞాన యాత్రల ద్వా రా విద్యార్థులు చదువును ప్రాక్టికల్‌గా నేర్చుకుంటారని, తమ లక్ష్యంపై అవగాహన కలిగి ఉంటారని పాఠశాల డైరెక్టర్ అనుదీప్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, పవన్, హసీనా పాల్గొన్నారు.

జోరుగా కలప అక్రమ రవాణా

- ధనార్జనే ధ్యేయంగా అక్రమార్కుల వ్యాపారం
- వాహనాల్లో ఇతర జిల్లాలకు తరలింపు
- అధికారుల కనుసన్నల్లోనే చీకటి వ్యాపారం..!



ట్రాక్టర్ ద్వారా ఇతర జిల్లాలకు తరలిస్తున్న కలప



తానంచర్ల గ్రామ సమీపంలో నిల్వ ఉంచిన కలప

మరిపెడ రూరల్: పర్యావరణం పరిరక్షించాలని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు, కాగితాలకే పరిమితమవుతున్నాయి. అటవీ, రెవెన్యూ శాఖ అధికారుల అలసత్వంతో ఈ కలప అక్రమ దందా జోరుగా సాగుతోంది. కలపకు ఇటుక బట్టీలు, బొగ్గు పరిశ్రమల్లో మంచి డిమాండ్ ఉండడంతో అక్రమార్కులు చెట్లను నరికి చీకట్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొంత మంది దళారులు పంట పొలాల్లో అనుమతులు లేకుండా చెట్లను నరికి రాత్రిళ్లు జిల్లా నుంచి ఇతర ప్రాంతాలైన సూర్యాపేట, ఖమ్మం జిల్లాలు, తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ తతంగం అంతా కూడా కొందరు అటవీ శాఖ కనుసైగల్లోనే సాగుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం హరితహారం పేరిట ఖర్చు పెట్టిన కోట్ల రూపాయలు వృథా అవుతున్నాయని ఆరోపిస్తున్నారు.

జరిమానా విధించి వదిలేస్తున్నారు..

రాష్ట్ర ప్రభుత్వం అటవీ శాతాన్ని రెట్టింపు చేసే ఉద్దేశంతో లక్షల రూపాయలు వెచ్చించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతీ ఏటా చేపడుతుంది. ఈ క్రమంలో ప్రతీ ఏడాది మొక్కలు నాటుతున్న 50 శాతం మొక్కలు కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. 40శాతం మొక్కలు నాటితే 30 శాతం వరకు చెట్లను నరికేస్తున్నారు. మండల పరిధిలోని వీరారం, ఉల్లెపల్లి, ఎడ్జెర్ల, తండధర్మారం, నీలికుర్తి, బీచ్‌రాజ్‌పల్లి, పురుషోత్తమాయగూడెం, తాళ్లఊకల్, తానంచర్ల తదితర ప్రాంతాల్లో ఎక్కువ మొత్తంలో చెట్లను నరికేస్తున్నారు. నరికిన చెట్లును మండల కేంద్రంలోని పదుల సంఖ్యలో వెలసిన ఇటుక బట్టీలకు, ఇతర ప్రాంతాల్లోని బొగ్గు పరిశ్రమలకు కలపను తరలిస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. అయినప్పటికీ స్థానికంగా విధులు నిర్వహించే అటవీ శాఖ అధికారులు పెడచెవున పెడుతూ వారు ఇచ్చే మాముళ్లకు అలవాటు పడి పట్టించుకోవడం లేదు. కొంత మంది అనుమతి తీసుకుంటున్నా ఒక్క చెట్టుకు అనుమతి తీసుకుని పెద్దమొత్తంలో చెట్లను నరుకుతున్నారు. అక్రమ కలప ట్రాక్టర్ చిక్కితే నామ మాత్రంగా రూ.500 జరిమానా విధించి వదిలేస్తున్నారని పలువురు చెపుతున్నారు. మండలంలోని రోజుకు సుమారు ఐదు నుంచి పది ట్రాక్టర్ల కలపను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం.

వాల్టా చట్టానికి తూట్లు..

వాల్టా చట్టం ప్రకారం కలప, ఇసుక తరలింపును అధికారులు అడ్డుకోవాల్సి ఉంటుంది. మండల స్థాయిలో ఏ అధికారి పట్టించుకోవడం లేదు. చెట్ల నరికి వేత, కలప తరలింపు నిరోధానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. రైతులు పట్టా భూముల్లో చెట్లను నరికి వేయాలనుకుంటే రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం స్థలాన్ని పరిశీలించి తహసీల్దార్ అనుమతి ఇస్తేనే రైతులు నరికివేయాలి. అధికారులు సైతం దళారులతో చేతులు కలిపారనే ప్రచారం జోరందుకుంది.

భారీగా జరిమానా విధిస్తాం..

అనుమతి లేకుండా అక్రమంగా కలపను తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతోపాటు భారీ జరిమానాలు విధిస్తాం. ఇటీవల మరిపెడ మండలంలో ఓ కలప లారీ పట్టుబడగా రూ.లక్ష రూపాయల జరిమానా విధించాం. ఎవరైన కూడా ఆన్‌లైన్ ద్వారా కలప పరిమిషన్ పొందవచ్చు. కానీ అక్రమంగా తరలిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవు.

– బత్తుల విశాల్, జిల్లా అటవీశాఖ అధికారి, మహబూబాబాద్

చెరువులను తలపిస్తున్న రోడ్లు



పెద్దవంగర వీధిలో నిల్వ ఉన్న వర్షపు నీరు



డోర్నకల్: 15వ వార్డు పరిధిలో..



పెద్దవంగర: నిల్వ నీటిని తొలగించాలని సిబ్బందికి సూచిస్తున్న ఎంపీడీఓ

పెద్దవంగర: ఇటీవల కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని పలు వీధుల్లో వర్షపు నీరు నిలిచింది. ముఖ్యంగా పాత ఎస్సీ కాలనీ సీసీ రోడ్లన్నీ వర్షపు నీటితో నిండుకున్నాయి. దీంతో బయటకు వెళ్లేందుకు కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై అడుగున్నర లోతు నీరు నిల్వ ఉండడంతో రాపోకలకు కొనసాగించేందుకు అనేక పాట్లు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో వర్షం కురిసిన ప్రతిసారి ముండల కేంద్రంలోని హనుమాన్ మందిరం నుంచి నీటి వరదంతా పాత ఎస్సీ కాలనీ రోడ్లపైకి ప్రవహించి ఇళ్లలోకి చేరుతున్నాయి. హనుమాన్ మందిరం నుంచి మోరీ వరకు సైడ్ కాల్వలు ఏర్పాటు చేస్తే రోడ్లపైకి, ఇళ్లలోకి వర్షపు నీరు చేరదని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. కాగా శనివారం ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి ఆయా కాలనీలను సందర్శించారు. గ్రామంలో నిల్వ ఉన్న ప్రాంతాల్లో నీటిని తొలగించేలా జీపీ సిబ్బందిని ఆదేశించారు.

డోర్నకల్: స్థానిక 15వ వార్డు పరిధిలో గార్ల రోడ్డు నుంచి లక్ష్మీ థియేటర్ వెళ్లే మార్గంలో రోడ్డుపై భారీగా వర్షపు నీరు నిల్వడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రక్కన రైల్వే శాఖ స్థలంలో అధికారులు ప్రహరీ నిర్మించడంతో వర్షపు నీరు వెళ్లే మార్గం లేక నీరు నిలిచి చెరువును తలపిస్తున్నాయి. మున్సిపాలిటీ పాలకవర్గం స్పందించి నీటి గుంతను పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాంబలక్ష్మి

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని వీరభవన్‌లో సంఘం పట్టణ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో రాణించేలా ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ కృషి చేయాలన్నారు. డ్వాక్రా మహిళలకు అన్ని బ్యాంకుల్లో ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, డ్వాక్రా రుణాలను రూ.50లక్షల వరకు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మహిళలకు రూ. 2,500 చెల్లించాలన్నారు. మహిళలు, బాలికలపై దాడులు పెరిగిపోతున్న తరుణంలో ప్రభుత్వం కఠినంగా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశం ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి.ఫాతిమా, ఎర్రోజు పద్మ, అలీ, భాగ్యమ్మ, మాధవి, రాణి, లక్ష్మీ, కవిత, గంగ, ఉమా పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

కేసముద్రం: షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లో నగదుతోపాటు సామగ్రి దగ్ధమైన సంఘటన మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన వీరయ్య అనే వ్యక్తి ఇంట్లో అర్ధరాత్రి దాటాక షార్ట్ సర్క్యూట్ కారణంగా ఫ్రిజ్‌లో మంటలు వ్యాపించడంతో ఇంట్లో ఉన్న దుస్తులు, ఇతర సామగ్రి, నగదు రూ.25వేలు దగ్ధమయ్యాయి. అప్పటికే స్థానికులు మంటలను చల్లార్చారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

నర్సంపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె బోయిన అశోక్, జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి, ఎస్‌ఆర్‌ఐ విభాగం రాష్ట్ర ఇన్‌చార్జ్ శానబోయిన రాజ్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు జినుకల కొమ్మాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 15 నుంచి తలపెట్టిన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను పట్టణంలో శనివారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులకు చేపపిల్లలు పంపిణీ చేసే బదులు నగదు బదిలీ చేస్తే మరింత ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాలన్నారు. ముదిరాజ్ కులానికి చెందిన నాయకులకు మంత్రి పదవి కల్పించాలన్నారు. కార్యక్రమంలో మత్స్య సొసైటీ జిల్లా చీఫ్ ప్రమోటర్ సోమయ్య, సదానందం, సోమయ్య నరహరి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉద్యోగావకాశాలు



వెంకటనారాయణకు పుష్పగుచ్ఛం ఇస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

తొర్రూరు: వాలీబాల్ క్రీడలో రాణించేందుకు కృషి చేయాలని భారత వాలీబాల్ జట్టు మాజీ కెప్టెన్ కన్నా వెంకటనారాయణ అన్నారు. శనివారం డివిజన్ కేంద్రానికి వచ్చిన ఆయనను వాలీబాల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. వాలీబాల్ క్రీడలో రాణించేందుకు అవసరమైన మెలకువలను తెలిపారు. వాలీబాల్ బాల్‌లను విరాళంగా అందించారు. క్రీడల్లో యువత రాణించేలా ప్రోత్సాహం కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు నిత్య జీవితంలో వాలీబాల్ క్రీడను భాగంగా చేసుకోవాలన్నారు. క్రీడలో రాణిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గొడిశాల నగేష్, ప్రధాన కార్యదర్శి దేవులపల్లి శంకర్, పీడీ వాసిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ప్రతినిధులు నాగరాజు, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా పీరీల ఊరేగింపు



మహబూబాబాద్ రూరల్: బాబునాయక్ తండాలో..



దంతాలపల్లిలో..

మహబూబాబాద్ రూరల్/దంతాలపల్లి: త్యాగానికి, భక్తికి ప్రతీకగా, కులమతాలకు అతీతంగా జరుపుకునే పీరీల పండుగ వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో లంబాడ గిరిజనులు, ముస్లింలు శనివారం పీరీల సవార్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. యువకులు, మహిళలు పీరీలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. పీరీల సవార్లను బ్యాండ్ వాయిద్యాలతో ఊరేగింపు చేసి ఇంటింటికి తీసుకువెళ్లి ప్రజలకు ఆశీర్వాదం అందించారు.

బురద రోడ్డుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



కంకర నేర్పుతున్న మున్సిపల్ సిబ్బంది

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని పూలబజారులో తమకు రోడ్డు వేయాలని స్థానికులు నిరాహారదీక్షకు దిగడంతో మున్సిపల్ అధికారులు స్పందించి తాత్కాలికంగా రోడ్డు వేశారు. శనివారం ‘సాక్షి’ దినపత్రికలో ‘చినుకుపడితే.. చిత్తడే’అనే శీర్షిక వెలువడింది. ఈ నేపథ్యంలో పూలబజారులోని 7వ వార్డులో మహ్మద్ ముక్తర్ మరికొంత మంది కలిసి శనివారం ఉదయం బురద రోడ్డుపై కూర్చొని నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షకు స్పందించకపోతే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించడంతో మున్సిపల్ అధికారులు స్పందించి, తాత్కాలికంగా సిమెంట్‌తో కలిపిన కంకర టిప్పర్ల ద్వారా ఆ వీధిలో బురదలేకుండా పరిచారు. కార్యక్రమంలో స్థానికులు మహ్మద్ ముక్తార్‌తోపాటు మహ్మద్‌సాబ్, షేక్ వలిరహమాన్, మన్సూర్‌అలీ, ఎండీ వాజిద్‌అలీ ఖాన్, సుభాని, గౌస్‌పాష, కనకమ్మ, ఉపేంద్రమ్మ, ఆదానియలాలు, తదితరులు పాల్గొన్నారు.


ఆటోలో నుంచి పడి మహిళకు గాయాలు



చికిత్స పొందుతున్న అజ్మీర విజయ

మరిపెడ రూరల్: వెళ్తున్న ఆటోలో నుంచి ప్రమాదవశాత్తు జారీ పడి ఓ గిరిజన మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని అజ్మీరతండా గ్రామ పంచాయతీ పరిధిలోని ధక్నా తండా సమీపంలో చోటుచేసుకోగా శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. అజ్మీరతండాకు చెందిన అజ్మీర విజయ తన కుమార్తె అత్తగారు ఊరు అయిన మండలంలోని స్టేజితండా జీపీ పరిధిలోని బుద్ధతండాకు వెళ్లి తిరిగి వస్తుంది. ఈ క్రమంలో అదేతండాకు చెందిన నవీన్ అనే యువకుడి ఆటో ఎరువుల బస్తాల ఓవర్ లోడుతో తానంచర్ల నుంచి తాళ్లఊకల్ గ్రామం మీదుగా అజ్మీరతండాకు వెళ్తుంది. విజయ తాళ్లఊకల్‌లో ఆటో ఆపి ఎక్కి డ్రైవర్ పక్కన కూర్చుంది. ఈక్రమంలో ఓవర్ లోడ్‌తో ప్రయాణిస్తున్న ఆటో గుంతల రోడ్డు కావడంతో ఓ సైడ్ ఒరగడంతో పట్టు తప్పి విజయ కింద పడింది. ఆటో టైర్ ఆమె కాలుపై నుంచి ఆటోపోవడంతో కుడి కాలుకు తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా ఆమెను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఓవర్ లోడ్‌తో ప్రయాణిస్తున్న ఆటోపై చర్యలు తీసుకొని ఆమెకు న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లి పాఠశాలలో పనిచేస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులు ఎండి రఫీ, వై.హేమన్ రెడ్డి, వి.శ్రీనివాసశర్మ స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. వారితోపాటు కె.కిరణ్ కుమార్, కె.లావణ్య బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల హెచ్‌ఎం ధారావత్ భద్రు అధ్యక్షతన వారికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి వారిని ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుడు ఎండి రఫీ పాఠశాల అభివృద్ధికి పదివేల రూపాయల నగదు వితరణ అందజేశాడు. కె.కిరణ్ కుమార్, కె.లావణ్య పదివేల రూపాయలతో పాఠశాలలో బ్లాక్ బోర్డులు చేయించడానికి ముందుకు వచ్చారు. అదేవిధంగా హేమన్ రెడ్డి, శ్రీనివాస శర్మ పాఠశాలకు రెండు వేల విలువగల మైక్ సెట్ బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.మౌనిక, మాడిశెట్టి సూర్య ప్రకాష్, జి.పవన్ రాజ్, వి.శ్రీదేవి, బి.కృష్ణమూర్తి, బొడ్డుపల్లి శంకర్, రాచకొండ ఉపేందర్, కుప్పం సూర్యతేజ, బానోతు శంకర్, హెచ్‌ఎంలు జి.నాగేశ్వరరావు, శివలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

డోర్నకల్: ఉరే వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. డోర్నకల్ ఏఎస్సై నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రావిగూడగెంకు చెందిన మందా వెంకన్న(55) గతేడాది జరిగిన ప్రమాదంలో గాయపడి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. చాలా రోజులుగా మంచానికి పరిమితమై పూర్తిస్థాయిలో నడవలేకపోయాడు. కూలి పనులు చేయలేకపోవడంతో మనస్తాపానికి గురైన వెంకన్న ఈనెల 11న ఇంట్లోని బాత్రూంలో ఉరేవేసుకోగా భార్యతోపాటు ఇంటి సమీపంలోని వారు గమనించి అపస్మారకస్థితికి చేరుకున్న వెంకన్నను 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకన్న శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు మందా నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఔదార్యం చాటుకున్న నాగమణి

గార్ల: గార్ల–డోర్నకల్ రహదారిలో శనివారం బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులకు కుక్క అడ్డు రావడంతో యువకులు కిందపడిపోయారు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న సీతంపేట ఎంపీటీసీ నాగమణి తన కారులో గాయాలైన యువలకును ఎక్కించుకొని ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించి తన ఔదార్యాన్ని చాటుకుంది.

మొక్కలు నాటాలని చిన్నారుల ర్యాలీ



డోర్నకల్: మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని కోరుతూ శనివారం సెయింట్ పాల్స్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆకుపచ్చ దుస్తులు ధరించి బెలూన్లు, ప్లకార్డులతో విద్యార్థులు పాఠశాల నుంచి రాజుతండా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సరిత, ఉపాధ్యాయులు మౌనిక, వసంత, మణి, రాజు, స్రవంతి పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం



కురవి: మండలంలోని నేరడ గ్రామంతోపాటు రాయినిపట్నం గ్రామాల్లో శనివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. నేరడ గ్రామాశివారు రాయినిపట్నంలో పిచ్చికుక్క పిట్టల రాములమ్మను కుడికాలు తొడపై మూడు చోట్ల కరిచింది. నేరడలో షర్ఫుద్దీన్ అనే వ్యక్తి రోడ్డుపై నడిచి వెళ్తుండగా ఎడమకాలును శునకం కరిచింది. రక్తస్రావం తీవ్రం కావడంతో మహబూబాబాద్‌లోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. పిచ్చికుక్క స్వైరవిహారం చేసి జనాలను కరుస్తున్నా ఎవరు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు విమర్శలు చేస్తున్నారు.

నివాళి

బయ్యారం: పీడిత ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించటం ద్వారానే అమరవీరులకు నివాళులర్పించినవారం అవుతామని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. బయ్యారంలోని పార్టీ కార్యాలయంలో శనివారం గణేష్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో భిక్షం, వీరభద్రం, రాకేష్, సంగన్న పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



కేసముద్రం: మండలంలోని రంగాపురం శివారులో అటవీ ప్రాంతంలో విద్యుదాఘాతంతో రాజీవ్‌నగర్ తండాలోని లకావత్ రెడ్యా అనే రైతుకు చెందిన ఆవు మృతి చెందింది. కేసముద్రంలో శనివారం రెడ్యా తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తన పశువులను అటవీ ప్రాంతంలో మేపుకుని తిరిగి వస్తుండగా సాయంత్రం 6గంటల ప్రాంతంలో తెగిపడిన విద్యుత్ వైర్‌ను ఆవు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ. 40వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

బాధిత కుటుంబానికి బియ్యం వితరణ



బియ్యం అందజేస్తున్న శంతన్ రామరాజు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని 30వ వార్డు పరిధిలోని హనుమంతునిగడ్డకు చెందిన ఆరెంపుల బుచ్చిరాములు మృతిచెందగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు శనివారం 50 కేజీల బియ్యం అందజేశాడు. కార్యక్రమంలో దళిత హిందూ పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొర్రె చిట్టిబాబు, టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్ పింగ్రాల రాందాసు, సినీ సంగీత దర్శకుడు చుక్క శ్రీనివాస్, నారాయణ్ సింగ్, లక్ష్మి పాల్గొన్నారు.